

హైదరాబాద్ వార్త

# వాటర్ మాఫియా!

## ప్రైవేటు ట్యాంకర్ల దోపిడీ.. డిమాండ్‌ను బట్టి అధిక రేట్లు




**హైదరాబాద్, మార్చి 15 ప్రభాతవార్త :** మహానగరంలో ప్రైవేటు నీటి ట్యాంకర్ల మాఫియా రాజ్యమేలుతోంది. జలమండలి ఉదా సీనత.. ప్రైవేటు జల వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. వాటర్ బోర్డు ట్యాంకర్ల ధర తక్కువగా ఉన్నప్పటికీ సరఫరాలో బుకింగ్ నుంచి డెలివరీ వరకు 12 నుంచి 24 గంటలు పడుతుండటం ప్రైవేటు ట్యాంకర్ల ఆపరేటర్లకు కలిసివస్తోంది. నగర శివారులోని ఖాళీ ప్లాట్లతో పాటు చెరువుల సమీపంలోని ఖాళీ ప్లాట్లతోపాటు చెరువుల సమీపంలోని ఖాళీ స్థలాల్లో బోర్లువేసి మరీ భూగర్భ జలాలను తోడేస్తున్నారు. స్థానిక నేతల అండదండలతో పగలు, రాత్రి అన్న తేడా లేకుండా నీటి దందా కొనసాగిస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటి తాగడానికే కాదు.. కనీసం ఇతర అవసరాలకూ నీళ్ల లేక అల్లాడుతున్న నివాస సముదాయాల డిమాండ్ ట్యాంకర్ల రేట్లను పెంచేస్తోంది. ట్యాంకర్ దొరికితే చాలనే గత్యంతరంలేని పరిస్థితుల్లో ఎంత ధరైనా పెట్టి ట్యాంకర్లు తెప్పించుకుంటున్నారు. వాస్తవంగా ప్రైవేటు ట్యాంకర్లపై ప్రభుత్వపరమైన నియంత్రణ లేకపోవడంతో అడ్డగోలుగా బాదేస్తున్నారు. సాధారణం గా 5వేల లీటర్ల వాటర్ ట్యాంకర్‌కు అవసరాన్ని బట్టి రూ.1500 నుంచి రూ.2000 వరకు వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు.

నగర శివారు ప్రాంతాల్లో నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. చెంగిచెర్ల, సిపిఆర్ఐ, జీడిమెట్ల ప్రాంతాల్లో ప్రైవేటుస్థలాలను లీజుకు తీసుకొని బోర్లు వేసుకొని నీటి వ్యాపారం సాగిస్తున్నారు. ఇది ఏదో రహస్యంగా సాగుతున్నదేమీ కాదు. యథేచ్ఛాగా ఈ నీటివ్యాపారం సాగుతున్న పట్టించుకునేవారు లేకపోవడం గమనార్హం. నగర నడిబొడ్డున అంబర్‌పేట గాంధీ బొమ్మ సమీపంలో ప్రధాన రహదారిపైనే నీటి వ్యాపా రం సాగుతున్న పట్టించుకునేవారు లేకుండా పోయారు. కాచిగూడ ఎస్సీ హాస్టల్ లైన్‌లో అక్కడ ఏకంగా వాటర్ క్యాన్ల ద్వారా 24 గంటల పాటు నీటి సరఫరా సాగుతోంది.

కూకట్‌పల్లిలో ఓ చెరువకు సమీపంలోని బస్తీలలో 80 గజాలలో రెండు, మూడు బోర్లు తవ్వి.. వాటి నుంచి అక్రమంగా నీటిని తోడేసి వ్యాపారం సాగిస్తున్నారు. అల్లాపూర్ డివిజన్, బాలాజీనగర్ డివిజన్ ప్రాంతాలలో అనేక బస్తీల్లో ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. బస్తీల్లో కొంతమంది పెద్దలు వాటాలు పంచుకుని నీటి వ్యాపారాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. మరోవైపు కాలనీల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయి ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు. అల్లాపూర్, బాలాజీ నగర్ డివిజన్‌ల పరిధిలోని కాముని చెరువు, మైసమ్మ చెరువు, సున్నం చెరువు, ఐడీఎల్ రంగదాముని చెరువు ప్రాంతాలను అడ్డాగా చేసుకుని నీటి వ్యాపారాలు సాగిస్తున్నారు. అమీర్‌పేట, ఎస్సార్‌నగర్‌లలో కొన్ని ప్రైవేటు హాస్టల్స్‌కు ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా సాగుతోంది. గండిపేట మండల పరిధిలోని మణికొండ, పుప్పాలగూడ, కోకాపేట, మంచిరేవుల, ఖానాపూర్, వట్టినాగులపల్లి, గౌలిదొడ్డి తదితర గ్రామాలలో నీటి ట్యాంకర్ల వ్యాపారం జోరుగూ సాగుతోంది. అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఐటీసంస్థలు, ఆసుపత్రులలో బోర్లు వట్టిపోవడంతో ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. దీంతో కొందరు వ్యవసాయ భూములను లీజుకు తీసుకుని బోర్లు వేసి రాత్రి, పగలు తేడా లేకుండా ట్యాంకర్లద్వారా నీటిని తరలిస్తున్నారు. పరిస్థితి ఇలా ఉంటే ఆయా ప్రాంతాల్లోనూ నీటి ఎద్దడి ఏర్పడుతుందని స్థానికులు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు పలుమార్లు దాడులు చేసినా తాత్కాలికంగా నీటి వ్యాపారం ఆపేసి..మళ్లీ ప్రారంభించడం గమనార్హం.

# ప్రభుత్వానికి స్వాధీనమైన మెట్రోరైల్

- నిర్వహణ బాధ్యత కియోలిస్ కంపెనీకే
- రూ. 15వేల కోట్లు రుణం ఇవ్వడానికి ఐఆర్ఎఫ్‌సి సిద్ధం
- ప్రభుత్వానికి తక్కువ వడ్డీకే రుణం



**హైదరాబాద్, మార్చి 15 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరానికి తలమానికంగా నిలిచిన మెట్రోరైల్‌ను తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఇందుకు అవసరమైన నిధులను సమకూర్చుకుంటోంది. నగరంలోని వివిధ ప్రాంతాల ప్రయాణికులకు అత్భుతమైన సేవలు అందిస్తున్న మెట్రోరైల్ ఇకముందు అదే విధంగా సేవలు అందించనుంది. ఇందుకోసం కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో నిర్వహణ బాధ్యతలను చేపట్టిన ఫ్రాన్స్‌కు చెందిన కియోలిస్ కంపెనీయే చూడనుంది. తాజాగా జరుగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంస్థపైనే నమ్మకంతో నిర్వహణ బాధ్యతలను అప్పగించనుంది. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో మెట్రోరైల్ కియోలిస్ కంపెనీ ద్వారానే అందించగలిగింది. మెట్రో నిర్వహణబాధ్యత వాస్తవానికి ఈ ఏడాది నవంబర్ వరకు ఉంది. అటు తరువాత ఈ సంస్థే నిర్వహణ బాధ్యతలు కొనసాగించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

అనేక పరిణామాల అనంతరం మెట్రోరైల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి అవసరమైన నిధులు ఇవ్వడానికి ఐఆర్ఎఫ్‌సీ అంగీకరించింది. గతంలో ఎన్నడూ లేనంత తక్కువ వడ్డీకి అవసరమైన రుణాన్ని తీసుకోనుంది. మెట్రోరైల్ నిర్మాణం కోసం అప్పట్లో ఎల్అండ్ టీ గతంలో 8 శాతం వడ్డీకి అవసరమైన మేరకు నిధులు సమీకరించింది. కాగా రాష్ట్ర ప్రభుత్వానికి ఐఆర్ ఎఫ్‌సీ (ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్) అతి తక్కువ వడ్డీకి రుణాన్ని ఇవ్వడానికి అంగీకరించింది. మెట్రోరైల్ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిస్తున్నందుకు దాదాపు రూ. రెండు వేల కోట్లు చెల్లించడంతో పాటు మెట్రో నిర్మాణానికి ఎల్ అండ్ టీ తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణాన్ని ప్రభుత్వమే ఎల్ఆండ్‌టీకి బదలాయించుకుంటుంది. మెట్రోరైల్ స్వాధీనం చేసుకోడానికి రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 15వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధపడింది. అయితే గతంలో ఏ ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తం ఖర్చుచేసి ఇప్పటివరకు ప్రైవేట్ ప్రాజెక్టును తీసుకున్న సందర్భాలు లేవు. ఒక్కో కిలోమీటరుకు రూ. 246 కోట్లు ఖర్చుపెట్టి, మొదటి దశ మెట్రో రైల్ ప్రాజెక్టు మొత్తం 61 కిలోమీటర్లకు రూ. దాదాపు 15వేల కోట్లు ఖర్చుపెట్టి ప్రాజెక్టును స్వాధీనం చేసుకుంటోంది. అలాగే రెండో దశ డీపీఆర్ ప్రకారం ఒక్కో కిలోమీటర్‌కు దాదాపు రూ. 350 నుంచి 370 కోట్లు ఖర్చు కానున్నట్లు తెలుస్తోంది. గతంలో నిర్మించిన ప్రాజెక్టుకు తాజాగా నిర్మించాలంటే రూ. 22 వేల కోట్లు ఖర్చు అయ్యే అవకాశం ఉందని, మెట్రోరైల్ ప్రాజెక్టును రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లక్కీగా తక్కువ ఖర్చుతో సొంతం చేసుకుందని అధికారులే చెబుతున్నారు. అంతేకాకుండా మెట్రో రైల్ నిర్మాణానికి అప్పట్లో ప్రభుత్వం భారీగా భూములు ఇచ్చింది. వాటినీ రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోనుంది. మెట్రో నిర్మాణ సమయంలో స్టేషన్లు, స్టేషన్లు, డిపోలకు కాకుండా వాణిజ్య అవసరాల కోసం ఎల్ అండ్ టికి 120 ఎకరాలను అప్పటి ప్రభుత్వం ఇచ్చింది. అందులో 49 ఎకరాల్లో మాత్రమే ఎల్ అండ్ టీ సంస్థ మాల్స్ నిర్మించి అద్దెకు ఇచ్చింది. ఇప్పుడు ఆ మాల్స్‌తోపాటు ఇంకా అభివృద్ధి చేయకుండా ఉన్న 71 ఎకరాలు ప్రభుత్వానికే చెందుతుంది. అలాగే మెట్రో స్టేషన్ల దగ్గర కట్టిన మాల్స్, షాపింగ్ కాంప్లెక్సుతోపాటు ఖాళీ భూములన్నీ ప్రభుత్వానికే దక్కనున్నాయి. మెట్రోరైల్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి దక్కే ఆస్తులను ప్రభుత్వం తనఖా పెట్టడం వల్లే ఐఆర్ఎఫ్‌సి ప్రభుత్వానికి రుణం ఇందజేస్తోంది. తనఖా పెట్టుకున్న ఆస్తుల మినహా మిగిలిన అస్తులను రాష్ట్ర ప్రభుత్వం అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంది. లేదంటే వేలం ద్వారావ అమ్ముకునే అవకాశం కూడా ఉంది.

**తక్కువ వడ్డీకే రుణం...**

రాష్ట్ర ప్రభుత్వం గతంలో అనేక అవసరాలకు రుణాలు తీసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వమే కాకుండా అంతకు ముందున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణానికి రుణాలను తీసుకుంది. కాని అప్పట్లో బిఆర్ఎస్ ప్రభుత్వం 9.45 శాతం నుంచి దాదాపు 10.90 శాతం వడ్డీకి రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది. అప్పట్లో పెద్ద మొత్తాలు అంతంత వడ్డీలకు రుణాలు తీసుకున్నారు. కాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ~రూ. 15వేల కోట్ల రుణాన్ని కేవలం 4.5 శాతం వడ్డీకే రుణాన్ని తీసుకుంటోంది. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ గొప్ప విజయంగా అధికారులు భావిస్తున్నారు. మెట్రోరైల్ ప్రాజెక్టు కోసం రూ. 15వేల కోట్లను (ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్) ఐఆర్ఎఫ్‌సి ఇవ్వడానికి సంసిద్ధత వ్యక్తం చేసిందని అధికారులు చెబుతున్నారు.

# బోడుప్పల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

## బైక్‌ను ఢీకొన్న కారు.. భార్యభర్తలు దుర్మణం



ప్రశాంత్, శ్రావాణి(ఫైల్‌ఫోటో)

**ఉప్పల్, మార్చి 15 ప్రభాతవార్త :** మేడిపల్లి పిఎస్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంగా వచ్చిన కియా కారు బైక్‌ను ఢీకొట్టి కొంత దూరం ఈడ్చుకుపోవడంతో బైక్‌పై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ భార్య మృతి చెందింది. కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం..రాంనగర్‌కు చెందిన మర్రి ప్రశాంత్(35) మెడికల్ రిప్రజేటివ్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఆదివారం మర్రి ప్రశాంత్, భార్య మర్రి శ్రావణి(33), కుమారుడు సహస్రార్(12) ముగ్గురు బైక్‌పై రాంనగర్ నుంచి మేడిపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మేడిపల్లి పీఎస్ పరిధిలోని డీకాదజ్లాన్ సమీపానికి రాగానే వెనుక నుండి అతివేగంగా వచ్చిన కియా కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న మర్రి ప్రశాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య శ్రావణి తీవ్రంగా గాయపడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుమారుడు సహస్రార్‌కు గాయాలయ్యాయి. బైక్‌ను ఢీకొట్టిన అనంతరం కారు బైక్‌ను కొద్ది దూరం వరకు ఈడ్చుకుపోయినట్లు సీసీటీవీలో రికార్డు అయింది. గాయపడిన చిన్నారితోపాటు మరికొందరిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. శ్రావణి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సహస్రార్ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. మృతుడు ప్రశాంత్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నారని పోలీసులు తెలిపారు. ప్రమాద సమయంలో కారులో యజమాని రిటైర్డ్ కండకర్ రామయ్య నడిపిస్తున్నాడని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం అతడిని పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన మేడిపల్లి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

**అనాధగా మారిన చిన్నారి...**

కారు డ్రైవర్ నిర్లక్ష్యం ఒక చిన్నారిని ఆనాధగా మార్చివేసింది. ఆదివారం రాంనగర్ నుంచి బంధువులను కలిసేందుకు ఇంటి నుంచి ఆనందంతో బయలుదేరిన ప్రశాంత్, శ్రావణిలు వేగంగా వచ్చిన కారుకు బలయ్యారు. అప్పటి వరకు వీరితోనే ఉన్న వారి కుమారుడు సహస్రార్ స్వల్ప గాయాలుతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## కాలేజీ విద్యార్థిని అదృశ్యం

**పేట్‌బషీరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త :** మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజీ హాస్టల్‌లో ఉంటూ ల్యాబ్ టెక్నీషియన్ మెడికల్ కోర్సు చదువుతున్న కలవేన కోమలి(19) అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనంప్రకారం..మార్చి 14న ఉదయం 9 గంటల సమయంలో హాస్టల్‌నుంచి బయటకు వెళ్లిన కోమలి తిరిగి రాలేదు. దీంతో హాస్టల్ నిర్వాహకులు ఆమె తండ్రి కొమురయ్యకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కొమురయ్య స్వస్థలం గోదావరిఖని నుంచి వెంటనే మైసమ్మగూడకు చేరుకుని కుమార్తె కోసం ఆరాతీశారు. ఈసందర్భంగా కోమలి కొంతకాలంగా ప్రవీణ్ అనే యువకుడితో ఫోన్‌లో మాట్లాడుతున్నట్టు తెలిసినట్లు తెలిపారు. దీంతో కొమురయ్య పెట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విద్యార్థిని ఆచూకీ కోసం దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు సీసీటీవీ దృశ్యాలు, ఫోన్ కాల్ వివరాలు పరిశీలిస్తూ కోమలి ఎక్కడికి వెళ్లిందనే దానిపై విచారణ కొనసాగిస్తున్నారు.

# చికెన్ చిక్కదు..!

## కిలో స్కిన్లెస్ ధర రూ.325లు



**హైదరాబాద్, మార్చి 15 ప్రభాతవార్త :** హైదరాబాద్ మార్కెట్లో కేజీ స్కిన్లెస్ చికెన్ ధర ఏకంగా రూ.325కి చేరుకుంది. ఆదివారం కావడంతో మాంసం ప్రియులు అధిక ధరలు చెల్లించి చికెన్ ముక్క కొనలేక గుటకలు వేస్తున్నారు. ఇటీవలి రోజుల్లో ధరలు ఆకాశాన్ని తాకుతూ.. కొండెక్కిన కోడిలా మారాయి. సాధారణంగా డిమాండ్ తక్కువగా ఉండే అన్ సీజన్లోనే చికెన్ ధరలు ఒక్కసారిగా పెరగడం వినియోగదారులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ సీజన్లో నమోదైన అత్యధిక ధర ఇదేసని వ్యాపారులు పేర్కొంటున్నారు. వారం రోజుల్లోనే ధరలు ఏకంగా రూ.30లు పెరిగాయి..నెల రోజుల క్రితం కిలో స్కిన్లెస్ రూ.250 ఉండగా, వారం క్రితం రూ.295 ఉంది. ఇలా క్రమంగా కిలో చికెన్‌పై 10 నుంచి 20 రూపాయల వరకు పెరుగుదల కనిపిస్తుంది దీంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. ఉత్పత్తి వ్యయం పెరగడం వల్ల ధరలు ఇలా భారీగా పెరిగాయని తెలుస్తోంది. హైదరాబాద్‌లో ధరలు గరిష్ట స్థాయికి చేరినప్పటికీ, గత వారంతో పోలిస్తే ఇతర ప్రాంతాల్లో ధరల్లో పెద్దగా మార్పు కనిపించడం లేదు. వివాహాది శుభకార్యాలు.. వరుస పండుగలు రావడంతో చికెన్‌కి ఒక్కసారిగా గిరాకీ పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్లుగా పౌల్ట్రీ ఉత్పత్తి లేకపోవడంతో సరఫరా దెబ్బతిని ధరలు పెరిగినట్లు చెబుతున్నారు. మొత్తం వచ్చే పండగ నెలలోనూ చికెన్ రేట్లు కిలో రూ.350 నుంచి రూ.400 వరకు పలికే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. చికెన్ ధర ఎంత అని అడిగి.. కొనకుండా వెళ్లిపోతున్నారని వ్యాపారాలు అంటున్నారు. ఇదే ధరకు హాఫ్ కేజీ మటన్ వస్తదని కదా అంటూ.. కొనకుండా కొనుగోలుదారులు వెళ్లిపోతున్నారట. భవిష్యత్తులో చికెన్ ధరలు మరింత భారంగా మారే అవకాశముందని సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

### నకిలీ చెల్లింపులతో మోసగించాడు..

## బంగారు ఉంగరంతో ఉడాయించాడు

**జూబ్లీహిల్స్, మార్చి 15, ప్రభాతవార్త:** ఆన్‌లైన్‌లో కొనుగోలు కోసం నకిలీ చెల్లింపులతో మోసగించి బంగారు ఉంగరంతో ఉడాయించిన సంఘటన జూబ్లీ హిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. అమీర్‌పేటకు చెందిన కార్తిక్ అనే వ్యక్తి ఆన్‌లైన్ స్టోర్ ప్లాట్‌ఫామ్ ద్వారా వెగాశ్రీ జువెలర్స్‌ను సంప్రదించాడు. దాదాపు 3.890 గ్రాములు ఉన్న 22 బంగారు ఉంగరాన్ని ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకున్నాడు. ఈ క్రమంలోనే స్టోర్ నిర్వాహకులు జూనియర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ అమర్‌ను ఉంగరం డెలివరీ చేయడానికి పంపారు. అమీర్‌పేటలోని సత్యం థియేటర్ వద్దకు అమర్ చేరుకోగా కార్తిక్ తాను రాకుండా తనకు పరిచయం ఉన్న ఒక వ్యక్తిని అక్కడికి పంపాడు. డబ్బులు చెల్లించినట్లు స్క్రీన్‌షాట్ చూపడంతో అమర్ ఆ ఉంగరాన్ని అతనికి అందజేసి వెళ్లిపోయాడు. అనంతరం కంపెనీ ఖాతాను పరిశీలించగా ఎలాంటి చెల్లింపులు జరగలేదని గుర్తించారు. కార్తిక్ పంపిన ఫోన్‌పే స్క్రీన్‌షాట్, ఎస్‌బీఐ బ్యాంక్ స్టేట్‌మెంట్ రెండూ నకిలీ గుర్తించారు. దీంతో కార్తిక్‌కు పలుమార్లు ఫోన్ చేసి డబ్బులు చెల్లించాలని కోరగా, తాను అమెరికాలో ఉన్నానని నమ్మించి మోసానికి పాల్పడ్డాడు. జరిగిన సంఘటనపై ఐటీ వెగశ్రీ జువెలర్స్ మేనేజర్ మధు ఫిర్యాదు చేయగా జూబ్లీహిల్స్ పోలీసులు కార్తిక్‌పై సెక్షన్ 318(4) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భావి తరాలకు సనాతన ధర్మాన్ని, సంస్కృతిని అందించడానికి ప్రభుత్వం కృషి

## పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**చిక్కడపల్లి, మార్చి 15 (ప్రభాతవార్త)** భావి తరాలకు సనాతన ధర్మాన్ని, సంస్కృతిని అందించేందుకు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను సంకీర్తన కార్యక్రమాల్లో భాగస్వాములను చేసే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. అన్నమాచార్య భావనా వాహిని వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ డాక్టర్ శోభారాజు ఆధ్వర్యంలో 523వ అన్నమయ్య ఆరాధన కార్యక్రమం ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. 45ఏళ్లుగా నిరంతరాయంగా సాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న అన్నమాచార్యుల విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు చిక్కడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం నుండి మహానగర సంకీర్తన కార్యక్రమం ట్యాంక్ బండ్ వరకు సాగింది. ఈ సందర్భంగా శోభారాజు మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అవాంఛనీయ సంఘటనల దృష్ట్యా మానసిక ప్రశాంతత కోసం, లోక కళ్యాణం కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. అనంతరం ఆమె స్వరపరిచిన 'అప్పని వరప్రసాద్ధి, బహుళ ద్వాదశి కొండల్లో నెలకొన్న రాత్రి పగలు వంటి కీర్తనలను విద్యార్థులతో కలిసి శ్రావ్యంగా ఆలపించారు. కొండల్లో నెలకొన్న కీర్తనలోని ఆంతర్యాన్ని భక్తులకు వివరించారు. పూజ్యశ్రీ ఆదిత్య పరాశీస్వామీజీ ఆశీర్వచనాలు అందిస్తూ.. ఎక్కడైతే అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తారో అక్కడ శ్రీవేంకటేశ్వర స్వామి కొలువై ఉంటారని చెప్పారు. నంగునూరి చంద్రశేఖర్, డాక్టర్ నంద కుమార్, రమణ పాల్గొన్నారు.



మంత్రి శ్రీధర్ బాబుకు జ్ఞాపికను అందిస్తున్న డాక్టర్ శోభారాజు తదితరులు

# చోరీ చేసింది 'షాహి-చంద్ ముఠానేనా'!

## చోరీ కేసులో మరో ముగ్గురి ప్రమేయం.. నేపాలి ముఠా కోసం పోలీసుల దర్యాప్తు ముమ్మరం





పోలీసులు స్వాధీనం చేసుకున్న చోరీకి ఉపయోగించిన సామాగ్రి, నిందితుడు మహేష్ షాహి

**జూబ్లీహిల్స్, మార్చి 15, ప్రభాతవార్త** జూబ్లీహిల్స్‌లో భారీ చోరీ వెనుక షాహి-చంద్ ముఠా ఉన్నట్లు స్పష్టమవుతుంది. దీనికితోడు జూబ్లీహిల్స్ చోరీ వెనుక కొత్త కోణం సైతం వెలుగు చూసింది. చోరీలో భార్యభర్తలే కాకుండా మరో ముగ్గురుతో కలిపిన ముఠా ఉన్నట్లు పోలీసులు ప్రాథమిక ఆధారాల ఆధారంగా గుర్తించినట్లు తెలుస్తుంది. గత నెలలో జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లో నివసించే వ్యాపారి రవీంద్రశర్మ నివాసంలో గత నెల 5న నేపాలి ముఠా చోరీకి పాల్పడింది. రూ. 2 కోట్ల విలువైన వజ్ర, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈసంఘటనలో ప్రధాన నిందితుడు జీవన్ అలియాస్ జీబన్ బహదూర్ చంద్ పరారీలో ఉండగా పోలీసులు భువన్ అలియాస్ భూపేందర్ షాహి, రమేష్ బహదూర్‌చంద్, కృష్ణ చంద్, దేబీ కాడెల్ అలియాస్ భీమ్మా, జనక్ కుమార్ బిక్రమ్ షాహి, లలిత్ బహదూర్ చంద్, మదన్ ఖత్రి, బొహార సుశీల్‌లు నిందితులుగా ఉన్నట్లు తేల్చారు. ఇందులో చంద్, షాహి పేరుతో ఉన్న వారే అత్యధికంగా ఉన్నారు. ఇక తాజాగా జరిగిన చోరీ ఘటనలో అనిరుద్‌రెడ్డి నివాసంలోనూ జరిగిన చోరీ సంఘటనలో మహేష్ షాహి, అప్సర షాహిలు ప్రధాన నిందితులుగా ఉన్నారు. దీంతో షాహి పేరుతో ఉన్న ముఠా ఈసారి చోరీకి పాల్పడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

**ముఠా పనేనా..!**

జూబ్లీహిల్స్‌లోని అనిరుద్‌రెడ్డి నివాసంలో 45 రోజుల క్రితం మహేష్ షాహి, అప్సర షాహిలు పనిలో చేరారు. మహేష్ షాహి మొక్కలకు నీళ్ల పట్టడంచేయగా, భార్య అప్సరషాహి ఇంటి లోపల అన్ని పనులు చేసేది. ఈ క్రమంలోనే ఇంట్లోని వస్తువులన్నింటిని అప్సర జాగ్రత్తగా గమనించింది. దీనికితోడు అనిరుద్‌రెడ్డి వారం రోజుల క్రితమే కూనూరు వెళ్లడంతో ఇంట్లో భార్య దీపికారెడ్డి ఒక్కరే ఉన్నారు. రియల్ వ్యాపారం నిర్వహించే క్రమంలో దీపికారెడ్డి సైతం కూనూరుకు వెళ్లేందుకు సిద్ధమైంది. ఇది గుర్తించిన అప్సర ఈ విషయాన్ని భర్తకు తెలియజేసింది. ఈ క్రమంలోనే షాహి తన అనుచరులకు ఈ విషయాన్ని చేరవేశారు. దీపికారెడ్డి కూనురు వెళ్లగానే ముందుగానే కొనుగోలు చేసిన కట్టర్లు, ఐరన్‌రాడ్లు, క్రోబార్, ఐరన్ సికల్, స్క్రూడ్రైవర్ తదితర వస్తువులతో సిద్ధమయ్యారు. అదేరోజు రాత్రి ఆమె ఇంట్లోకి చొరబడి మొదటి అంతస్తులోని రెండు పడక గదుల్లో ఉన్న లాకర్లు, అల్మారాలను పగులగొట్టారు. ఇల్లంతా చిందరవందర చేశారు. అయితే ఈ వ్యవహారంలో ముందుగా వేసుకున్న పథకం ప్రకారం.. మహేష్ షాహి, అప్సర షాహిలు తమతోపాటు మరో ముగ్గురు సభ్యులతో ఈ చోరీకి పక్కాగా ప్లాన్ చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. తొలుత ఇద్దరే చోరీకి పాల్పడ్డారని భావించినప్పటికి దర్యాప్తులో భాగంగా సేకరించిన సాంకేతిక ఆధారాల ఆధారంగా మరో ముగ్గురు దీని వెనుక ఉన్నట్లు అనుమనిస్తున్నారు. ఈ క్రమంలోనే పోలీసులు వారిని పట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోపక్క వరుసగా చోటుచేసుకుంటున్న ఈ నేపాలి ముఠా చోరీల వెనుక నిందితుల్లో షాహి-చాంద్ పేర్లతో ఉన్న వారే ఎక్కువగా ఉండటంతో వారే ముఠాగా ఏర్పడి అవకాశం కోసం ఎదురు చూసి ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు ఒక పోలీసు అధికారి తెలిపారు. మరోవైపు నిందితులను పట్టుకొనేందుకు పోలీసు బృందాలు ఇంకా గాలిస్తూనే ఉన్నాయి.

# జిహెచ్‌ఎంసి మూడు ముక్కల కుట్ర వెనుక రాజకీయ లెక్కలు

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు




బిజెపిలో చేరిన పంజాల గిరిధర్‌గౌడ్‌ను అభినందిస్తున్న ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త** జీహెచ్‌ఎంసీని అశాస్త్రీయంగా మూడు భాగాలుగా విభజించిన కుట్ర వెనుక రాజకీయ లెక్కలు ఉన్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ప్రముఖ సంఘ సేవకులు, గౌడ సంఘం అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పంజాల గిరిధర్‌గౌడ్ తమ మద్దతుదారులతో కలిసి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. అయనతో పాటు మాజీ కార్పొరేటర్ కుటుంబానికి చెందిన న్యాయవాది కవిత, పృద్వీరాజ్ తమ అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పార్టీలో చేరిన గిరిధర్‌గౌడ్ తదితరులకు పార్టీ కండువా కప్పి సాదరంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి డా.గౌతంరావు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక రెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ బీజేపీ అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి విఠల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్.రాంచందర్ రావు మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత పంజాల గిరిధర్‌గౌడ్ తోపాటు కవిత తదితర అనేక మంది యువకులు, మహిళలు భారతీయ జనతా పార్టీలో చేరడం పార్టీపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. పార్టీలో చేరిన వారందరికీ స్వాగతం పలుకుతూ, ప్రజా సేవా ధృక్పథంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగర అభివృద్ధి నిజంగా జరగాలంటే బీజేపీకి అవకాశం ఇవ్వాలని, బీజేపీ మేయర్‌ను గెలిపిస్తే నగరానికి పారదర్శక పరిపాలన, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని రాంచందర్ రావు గారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ రాజకీయాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. జీహెచ్‌ఎంసీని అశాస్త్రీయంగా మూడు భాగాలుగా విభజించిన కుట్ర వెనుక రాజకీయ లెక్కలు ఉన్నాయని విమర్శించారు. నగరంలో ప్రజలు స్పష్టమైన మార్పు కోసం ఎదురుచూస్తున్నారని, రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలనే సంకల్పంతో మహిళలు, యువత ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనపై విశ్వాసంతో ప్రతి రోజు పెద్దఎత్తున ప్రజలు భారతీయ జనతా పార్టీలో చేరుతున్నారని, ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల ప్రజలు బీజేపీ వైపు ఆశతో చూస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాజకీయాల్లో సార్థక మార్పు తీసుకురావడానికి ఇది సంకేతమని చెప్పారు.



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, అధికారులు

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి : ఎమ్మెల్యే

**కంటోన్మెంట్, మార్చి 15 ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అధికారులను ఆదేశించారు. ఆదివారం మోండా డివిజన్ ప్రజల కోసం షెనాయ్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులలో భాగంగా ఏర్పాటు చేసిన కంటోన్మెంట్ వాణి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, రెవెన్యూ, గృహ నిర్మాణం, విద్యుత్, పోలీస్, ట్రాఫిక్, సివిల్ సప్లయ్, ఎలక్ట్రిసిటీ వంటి వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే విచారణ జరిపి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు చిర్రబోయిన సంతోష్‌యాదవ్, సి.వైష్ణవియాదవ్, సి.బద్రినాథ్‌యాదవ్, ఆర్.డి.నాగేశ్‌యాదవ్, గణేష్ దేవాలయం చైర్మన్ ప్రభాకర్‌యాదవ్, వెంకట్‌రాజు, ధనలక్ష్మి, నర్సింగ్‌రావ్, బాబురావ్, జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ డాకూనాయక్ అధికారులు పాల్గొన్నారు.

## వంట గ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టాలి : సిపిఎం



తుకారాంగేట్‌లో ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

**కంటోన్మెంట్,మార్చి 15 ప్రభాతవార్త:** వంట గ్యాస్, వాణిజ్య సిలిండర్ల కొరతను పరిష్కరించాలని సిపిఎం కార్యదర్శి ఆర్.మల్లేష్ డిమాండ్ చేశారు. వంట గ్యాస్ కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.శారధ, ఆర్.అంజమ్మ, గోవిందమ్మ,కౌశల్య,లక్ష్మి, పండరీబాయి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : శ్రీనివాస్



రసూల్‌పురాలో సమస్యలు తెలుసుకుంటున్న టిఎన్.శ్రీనివాస్

**కంటోన్మెంట్, మార్చి 15 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 2వ వార్డులోని వివిధ బస్తీలలో నెలకొన్న సమస్యలను సిఈఓ దృష్టికి తెచ్చి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం 2వ వార్డులోని రసూల్‌పుర సి.బి.ఎన్.నగర్ పరిసర ప్రాంతాల్లో ఆయన పాదయాత్రలు జరిపి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు కుమార్ ముదిరాజ్,నర్సింహ్మ, పొన్నాల బాబు, నారాయణ, మహేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పాతబస్తీలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు



జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శిని కలిసిన మీర్జా ముజాఫర్ అలీ బేగ్

**చార్మినార్, మార్చి 15 ప్రభాతవార్త :** పాతబస్తీ చార్మినార్, యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన జనసేన పార్టీ నాయకులు ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్నారు. చార్మినార్ నియోజక వర్గం జనసేన పార్టీ ఇంఛార్జి, రాష్ట్ర మైనార్టీ ఇంఛార్జి మీర్జా ముజాఫర్ అలీ బేగ్, యాకుత్‌పుర నియోజకవర్గం జనసేన పార్టీ ఇంఛార్జి సీతారామ్ నాయక్‌తో పాటు పాతబస్తీకి చెందిన పలువురు నాయకులు తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి రామ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా చార్మినార్ నియోజకవర్గం జనసేన పార్టీ ఇంఛార్జి మీర్జా ముజాఫర్ అలీ బేగ్ మాట్లాడుతూ పాతబస్తీలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతున్నదని తెలిపారు.ప్రజలు నుంచి మంచి స్పందన వస్తున్నదని ఆయన తెలియజేశారు. రాబోయే కాలంలో జనసేన పార్టీ రెపరెప లాడుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తారాసింగ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మంత్రి వర్గంలో యాదవ్‌లకు చోటు కల్పించాలి

**సైఫాబాద్, మార్చి 15 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన యాదవులపై ప్రభుత్వం చిన్నచూపుచూస్తుందని తెలంగాణ యాదవ్ జెఎసి ఛైర్మన్ డా. దాసరి అజయ్‌కుమార్‌యాదవ్ ఆరోపించారు. ప్రభుత్వం అన్ని రంగాలల్లో యాదవులకు న్యాయం చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన యాదవుల మేధావుల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అత్యధిక జనాభా కలిగిన యాదవులకు రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం లేకపోవడం దారుణమన్నారు. తక్షణమే మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని, అలాగే నామినేటెడ్ పదవులు ఛైర్మన్‌లు, డైరెక్టర్ల అవకాశం కల్పించాలని, కోకాపేటలో నిర్మించిన యాదవుల ఆత్మగౌరవ భవనాన్ని యాదవులకు అప్పగించి ప్రారంభించాలని, యాదవుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 10 వేల కోట్లు కేటాయించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిపి మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రంలో మరో యాదవుల ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ సదస్సులో జెఎసి వైస్-ఛైర్మన్ చిలుకల శ్రీనివాస్‌యాదవ్, అధ్యక్షుడు సిద్ది రమేష్‌యాదవ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు బెల్లి చంద్రశేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బిపి మండల్ కమిషన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

# అంబీర్ చెరువు అభివృద్ధి చేయాలంటూ నిరసన

**నిజాంపేట్, మార్చి 15, ప్రభాతవార్త**

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని తుర్కచెరువు, పాపయ్య కుంట, పత్తికుంట, మేడికుంట, పెద్ద చెరువు, నిజాంపేట్ హైదర్‌నగర్ మధ్య విస్తరించి ఉన్న అతిపెద్ద అంబీర్ చెరువు వద్ద మురికి నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రగతినగర్ అంబీర్ చెరువు బతుకమ్మ ఘాట్ వద్ద నిజాంపేట్ సర్కిల్ ప్రజలు భారీ నిరసనకార్యక్రమం నిర్వహించారు. చెరువులో గుర్రపు డెక్క తొలగించడం, ఎస్టీపీ ఏర్పాటు చేయడం, వాకింగ్ ట్రాక్ నిర్మించడం, దోమల నివారణకు చర్యలు చేపట్టడం, చెరువుల సమగ్ర అభివృద్ధి కోసం తక్షణమే నిధులుకేటాయించి పనులు ప్రారంభించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈసందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ 2016కు ముందు ప్రగతినగర్ పాలకులు ఇంటికి రూ.500 వసూలు చేసినప్పటికీ చెరువుల అభివృద్ధిని పూర్తిగా నిరక్ష్యం చేశారని విమర్శించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం రెండుసార్లు అధికారంలో ఉన్నప్పటికీ 2016లో అంబీర్‌చెరువు వద్దకు వచ్చి అభివృద్ధిచేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయలేదని అన్నారు. అలాగే కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే మూడుసార్లు గెలిచినా చెరువుల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి చూపలేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా అంబీర్ చెరువు అభివృద్ధికి రూ.150 కోట్లు, అలాగే నిజాంపేట్ తుర్కచెరువు, పాపయ్యకుంట, బాచుపల్లి పత్తికుంట, మేడికుంట, పెద్దచెరువు అభివృద్ధికి మరో రూ.150 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎన్నికల సమయంలో ఓట్లు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి ఉండదని హెచ్చరించారు.చెరువుల అభివృద్ధి చేయకుండా గుర్రపు డెక్క, మురికి నీరు, దోమల సమస్యలకు కారణమైన బిఆర్‌ఎస్ పార్టీకి ఇప్పటికే ఓట్లు అడిగే నైతికహక్కు లేదని ప్రజలు గమనించాలని కోరారు. చెరువుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ప్రతి నెలా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో అమలేశ్వరి, ప్రసాద్, అరుణ్, మురళి, ఈశ్వర్‌రెడ్డి, మాధవ రావు, చందు, హనుమయ్య, అంకం సతీష్, ఎల్లస్వామి, కృష్ణ, శ్రీధర్, పాండు, రంగనాయకులు, శ్రీనివాస్, ప్రవీణ్, కళ్యాణ్, వెంకటేష్, రాజశేఖర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రజలు

## రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సంజీవరెడ్డినగర్, మార్చి 15 ప్రభాతవార్త :** రక్తదానం ప్రాణాపాయస్థితిలో ఉన్నవారి ప్రాణాలను కాపాడగలదని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం సనత్‌నగర్‌లోని వినాయక గ్రౌండ్‌లో టీమ్ కేర్ అండ్ షేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లు, వాతావరణ మార్పులు, ఆరోగ్యంపట్ల తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ప్రజలు వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, సనత్ నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు కరుణాకర్ రెడ్డి, రాజేష్ ముదిరాజ్, కొలన్ భూపాల్ రెడ్డి, అనంత రెడ్డి, కూతురు నర్సింహ, ప్రకాష్‌గౌడ్, హరి, సాయి, గోపిలాల్ చౌహాన్, అర్జున్ గౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ ఆహార పదార్థాలను తక్షణమే నిరోధించాలి

**సైఫాబాద్, మార్చి 15 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రోజు, రోజుకు పెరిగిపోతున్న అన్ని ఆహార పదార్థాల్లో కల్తీని వెంటనే నిరోధించాలని, లేనిపక్షంలో వినియోగదారులు, బాధితులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని తెలంగాణ స్వాభిమాన్ పరిషత్ కన్వీనర్ కె.వినయ్‌కుమార్‌యాదవ్ హెచ్చరించారు. గతంలో పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తిచేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. తమ సంస్థ దశాబ్ధకాలంగా కల్తీ ఆహార పదార్ధాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నదని చెప్పారు. ఆదివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కల్తీ నిరోధకానికి పెద్ద ఎత్తున చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా కల్తీ చేసినవారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం లడ్డుప్రసాదంలోనే కల్తి జరిగిందని, ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలోని అన్ని ఆహార పదార్థాలు మొదలు చివరికి దైవానికి సమర్పించే కుంకుమ, పశుపు, గంధం, పాలు, నెయ్యి, తెనేతోపాటు మందులు, రక్తం తదితర ప్రతి ఆహార వస్తువులలో కల్తీ జరుగుతున్నదని, దీంతో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వచ్ఛమైన, నాణ్యమైన ఆహార పదార్ధాలను అందించవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైన ఉందన్నారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తెలంగాణ అని ప్రభుత్వాలు ప్రకటనలు చేయడమే తప్పా అచరణలో ఏమి లేదన్నారు. కల్తీ రాయుళ్ళపై ఉక్కుపాదం మోపాలని, కల్తీపై ప్రజలకు ప్రభుత్వాలు అవగాహన కల్పించాలని, ప్రజలకు స్వచ్ఛ నిర్ధారణ కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పరిషత్ ప్రతినిధులు సిరిగిరి ప్రభాకర్, జి. వేణుగోపాల్, వెంకటేష్, సురేష్, శ్రీనివాస్, బాల్‌రాజ్‌యాదవ్, శంకర్, బషీర్, జాన్సన్ పాల్గొన్నారు.

## కొంపల్లి సర్కిల్ 56లో ఆస్తి పన్ను పరిష్కార వేదిక

**కొంపల్లి, మార్చి 15, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం కొంపల్లి సర్కిల్ 56 పరిధిలో ఆస్తిపన్ను పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఆస్తి పన్ను సంబంధిత సమస్యలు, సందేహాల నివృత్తి కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజలు తమ ఆస్తి పన్ను వివరాలకు సంబంధించిన వివిధ సమస్యలను అధికారుల వద్ద తెలియజేసి సమాధానాలు పొందారు. ప్రజలు తమ ఆస్తి పన్ను బకాయిలను సమయానికి చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని అధికారులు సూచించారు. అలాగే మున్సిపల్ సేవలను మెరుగుపర్చడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు.

### శానిటేషన్ పనులపై పర్యవేక్షణ

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం కొంపల్లి సర్కిల్-56 పరిధిలో జరుగుతున్న శానిటేషన్ కార్యక్రమాలను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ అసిస్టెంట్ కమిషనర్ యాదగిరి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రాంతాల్లో కొనసాగుతున్న శుభ్రత పనులను పరిశీలించి శానిటేషన్ సిబ్బందికి అవసరమైన సూచనలు అందించారు. కార్యక్రమంలో సాలిడ్ వేస్ట్‌మేనేజ్మెంట్ డిప్యూటీ ఇంజనీర్ తిరుపతి, ఏఈఈ కుమారి కృపా ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




ఆస్తి పన్ను పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



రంజాన్ కిట్లను పంపిణీ చేస్తున్న మోతె రోహిత్, దిడ్డి రాంబాబు

## రంజాన్ మాసం సామరస్యానికి ప్రతీక

### రోహిత్, దిడ్డి రాంబాబు

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త :** రంజాన్ మాసం ఒక మతానికి చెందిన పండుగ మాత్రమే కాదు. హైదరాబాదు నగరంలో అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి జీవించే గంగా-యమునా సంస్కృతికి ఇది ప్రతీక అని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోతె రోహిత్, జిహెచ్‌ఎంసి కాంగ్రెస్ పార్టీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రంజాన్ కానుకల పంపిణీ కార్యక్రమం ద్వారా ముస్లింలకు అండగా నిలవడం సంతోషంగా ఉందన్నారు.ఆదివారం అంబర్‌పేట్ నియోజకవర్గంలోని బర్కత్‌పుర డివిజన్ చప్పల్ బజార్, కాచిగూడలో ఉన్న మస్తాన్ సాహెబ్ మస్జిద్‌లో రంజాన్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాదు నగరంలో అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో పండుగలు జరుపుకునే సంప్రదాయం ఎంతో ప్రత్యేకమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ సందర్భంగా ముస్లిం కుటుంబాలకు సహాయం అందించే పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రంజాన్ కానుకలద్వారా మహిళలకు, పురుషులకు దుస్తులు అందజేయడంతోపాటు మస్జిద్‌లలో ఇఫ్తార్ ఏర్పాట్ల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సామరస్యాన్ని మరింత బలపరుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ కమిటీ పెద్దలు షాహిన్ భాయ్, కార్యదర్శి అఫ్జల్ భాయ్, జాయింట్ సెక్రెటరీ కలీమ్ ఖురేషీ, అద్నాన్, అబ్దుల్ రహీమ్, వేణుగోపాల్, మల్లేష్, దీపక్, సాయి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింల సంక్షేమానికి కట్టుబడేది కాంగ్రెస్ ప్రభుత్వం

### మోతె రోహిత్, పులి జగన్



ముస్లింలకు కిట్లను పంపిణీ చేస్తున్న మోతె రోహిత్, పులి జగన్

**హైదరాబాద్, మార్చి 13 ప్రభాతవార్త :** ముస్లింల సంక్షేమానికి కట్టుబడేది కాంగ్రెస్ ప్రభుత్వమని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోతె రోహిత్, అంబర్‌పేట మాజీ కార్పొరేటర్ పులి జగన్ అన్నారు. ఆదివారం అంబర్‌పేటలో రంజాన్ తోఫాకిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ ఒక పెద్ద పండుగ అన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ వేడుకలను సోదర భావంతో జరుపుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికి రంజాన్ కిట్లను అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాలన వచ్చిన తరువాత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్ని వర్గాలకు సమన్యాయం చేసే దిశగా కృషి చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా అంబర్‌పేటలో రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అంతకు ముందు రోహిత్ జన్మదినం సందర్భంగా పులి జగన్ ఆధ్వర్యంలో బర్త్‌డే కేక్ కట్‌చేశారు.

## రంజాన్ కిట్లు పంపిణీ

**చార్మినార్, మార్చి 15 ప్రభాతవార్త:** కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ నాయకులు రజా అలీ మీర్జా అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా పాతబస్తీ నూర్‌ఖాన్ బజార్‌లో మైనార్టీలకు ప్రభుత్వం తరు పున ఆయన ఈద్‌కా తోఫా కిట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నదని తెలిపారు. పాతబస్తీలో మెట్రో రైల్ ప్రాజెక్టు పనులు చురుకుగా జరుగుతున్నాయని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బతుకులోని భంగిమలే భారతీయ శాస్త్రీయ నృత్యాలు

**రవీంద్రభారతి, మార్చి 15 ప్రభాతవార్త :** మన బ్రతుకు నిత్యం నృత్యమన్నారని, బతుకులోనే అనేక భంగిమలుంటాయని, వాటిలోని మేలిమి భంగిమలను ఏర్చికూర్చిన మాలనే నృత్యమని భారతీయ శాస్త్రీయ నృత్యాలని రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ సంస్థ అధ్యక్షురాలు లయన్ లలితారావు నేతృత్వంలో రవీంద్రభారతి ప్రధానమందిరంలో కోలేటి దామోదర్‌గుప్తా సభాధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం అయిన తర్వాత, ఉగాది వేడుకలను ముందుగా నిర్వహిం చిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ ఈ వేడుకల పట్ల ఆనందంగా ఉందని, అయితే భారతీయులు శతాబ్దాల క్రితం నుంచి స్త్రీలను సముచితరీతిలో చూడడమే కాకుండా దేవతారూపంలో పూజించడం చేస్తూనే ఉన్నారని, అర్ధనారీశ్వరం అనే తత్వాన్ని ప్రబోధించిందని గుర్తుచేశారు. కూచిపూడి, ఆంధ్ర నాట్యం, పేరిణి,భరతనాట్యాలు భారతీయతకు, భారతీయ సంప్రదాయాలకు నిదర్శనమైన ప్రత్యేక నృత్యరూపాలని స్పష్టం చేశారు. నేడు ఆరేడేళ్ల చిన్నారులు ఈ నృతకళపై ఆసక్తితో అభ్యసించి ప్రదర్శలివ్వడం హర్షదాయకవైనా సంగీత సాహిత్య నృత్య శిల్పం లలితకళలను కొద్దికాలంచేసి వదిలేయ కుండా జీవితాంతం కొనసాగించినప్పుడే సమాజం కళాకారులుగా గుర్తించుకోదని ఎల్లకాలం గుర్తు చేసుకోవాలని హితవు పలికారు.

అనంతరం విశిష్ట అతిథులు విజయ్‌కుమార్, పసుమర్తి లక్ష్మి వెంకటేశ్వరశర్మ దంపతులు, రామ్మోహన్, లలితారావు లతోకలిసి ప్రముఖ మహిళలకు నారీశక్తి అవార్డులు, సంగీత నృత్యగురువులకు శ్రీపరాభవనామ ఉగాది పురస్కారాలు ప్రదానంచేసి, చిన్నారి కళాకారులకు జ్ఞాపికలను అందజేసి శుభాభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా కళాకారులను వివిధ నృత్యాలు అంబరాన్నంటి తన్మయుల్ని చేశాయి.




సన్మానిత కళాకారులతో నరసింహారెడ్డి, దామోదర్‌గుప్తా, లలితారావు తదితరులు



పురస్కార గ్రహీలతో డా.ఎన్.రామచంద్రరావు

## మహిళల అభ్యున్నతే దేశానికి శ్రీరామరక్ష

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు

**సైఫాబాద్, మార్చి 15 ప్రభాతవార్త:** మహిళల అభ్యున్నతే దేశానికి శ్రీరామరక్ష అని, మహిళలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎన్.రామచంద్రరావు స్పష్టం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పీపుల్స్ ప్లాజాలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా ఎదురవుతున్న పరిణామాలను చూస్తే ప్రధాని నరేంద్రమోదీ అన్ని దేశాలను కలుపుకుంటూ శాంతి కోసం చేస్తున్న ప్రయత్నాలు అనితర సాధ్యమని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వివిధ రంగాలలో విశిష్టమైన సేవలు అందించిన మహిళా మూర్తులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు డా.శివలెంక నాగ ఉదయలక్ష్మి, పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఛైర్మన్ డా.బాలకృష్ణ, జర్నలిస్ట్ డా.సూర్యప్రకాష్, గంగారం, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సందర్భంగా రామచంద్రరావు దివ్యాంగురాలైన శారదకు కృతిమ కాలును అందజేశారు.

## మెరుగైన వైద్యానికి రూ.4 లక్షల ఎల్‌ఓసి అందజేత

అడ్డగుట్ట, మార్చి 15 ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అందజేస్తున్న ఎల్‌ఓసీతో వైద్యం చేయించుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. 8వ వార్డు బొల్లారం సదర్ బజార్‌కు చెందిన శ్రీనివాస్ కుమార్తె చిత్ర అనారోగ్యంతో బాధపడుతుంది. నిమ్స్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకునేందుకు ప్రభుత్వం నుంచి మంజూరైన 4 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని బాధితురాలి తండ్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు చిర్రబోయిన వైష్ణవి యాదవ్, గుజ నాగేందర్ యాదవ్, మురళీ ముదిరాజ్,అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : సిఐ

**చార్మినార్, మార్చి 15 ప్రభాతవార్త :** వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కామాటిపుర పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు అన్నారు. అశ్రిత రెయిన్ బో హోమ్, జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దూద్‌బౌలిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కామాటి పుర ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు ప్రారంభించారు. వైద్యశిబిరంలో ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కిమ్స్ ఆసుపత్రి వైద్యులు 200 మందికి ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కామాటిపుర ఎస్‌ఐ నర్సింహులు, టిడిపినాయకులు బి.శ్యామ్‌సుందర్, అశ్రిత సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ వి.పర్వతాలు, జనహిత సేవా ట్రస్ట్ నర్సింహమూర్తి, ఫైనాన్స్ మేనేజర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది, శిరీష, అనిత, శ్రీజ, జమున, స్వాతి, నగ్మా, శివమ్మ పాల్గొన్నారు.

## సాన్ ఫోర్ట్ ప్లే స్కూల్‌ని ప్రారంభించిన ఎమ్మెల్సీ

**దుండిగల్, మార్చి 15, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ 295 డివిజన్‌లోని డిపిఎస్ స్కూల్ మార్గంలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన సాన్ ఫోర్ట్ ప్లే స్కూల్‌ను మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లే స్కూల్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని, ప్లే స్కూల్ అంటే ఇటుకలు, సున్నాలతో కూడిన భవనం మాత్రమే కాదని ఇది పిల్లల భవిష్యత్తుకు పునాది వేసే స్థలమని తెలిపారు. ప్లే స్కూల్ అనేది ఉత్సుకత, దయను పెంపొందించి, ఆట ద్వారా నేర్చుకోవడంలో ఆనందాన్ని నేర్పే ప్రదేశం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ ప్యాక్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, బెంబడి బుచ్చిరెడ్డి, మురళి యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, హనుమంతరావు, నాయకులు ఎస్వీ సురేందర్‌రెడ్డి, ధర్మారెడ్డి, బైండ్ల గోపాల్, పాక్స్ డైరెక్టర్ జీతయ్య, స్థానిక నాయకులు, ప్లే స్కూల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## రమణాచారి అభినందన సత్కారం

**చిక్కడపల్లి, మార్చి 15 ( ప్రభాతవార్త) :** సమీకృత అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సారస్వత సంఘం(ఇట్కలా) వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర పూర్వ ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ రమణాచారికి అభినందన సత్కార సభ ఆదివారం ఇట్కలా సంస్థ అధినేత, సంస్కృతిరత్న డాక్టర్ ధర్మారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా శ్రీపరాభవనామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని ఇట్కలా సంస్థ రూపొందించిన సాహితి, సాంస్కృతిక కార్యక్రమాల వివరణాత్మక పత్రాన్ని ఆవిష్కరించారు.కార్యక్రమంలో డాక్టర్ కె. ధర్మారావు మాట్లాడుతూ, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు రమణాచారి గారు అందిస్తున్న స్ఫూర్తి అజరామరమని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ పూర్వ కార్యనిర్వహణాధికారి పి. మధు, భారతీయ రైల్వేల జాతీయ నాయకుడు పి. యుగంధర్,ప్రముఖ నటుడు, రచయిత మంత్రి భుజంగ రావు, శ్రీసత్యసాయి సేవా సంస్థల హైదరాబాద్ జిల్లా మెడికల్ క్యాంపుల సంధానకర్త కె.వి. భానుమూర్తి, తెలుగు కళలను, సాహిత్యాన్ని భావితరాలకు అందించడంలో ఇట్కలా సంస్థ చేస్తున్న కృషిని డా. రమణాచారి అభినందించారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, M.M. District At Medchal
O.S. No. [illegible] OF 2026
BETWEEN:
Smt N Sobha Latha & Others ...Plaintiffs
AND
The Tahsildar, and another Dundigal Gandimaisamma Mandal, Medchal Malkajgiri District ...Defendants
To,
All Concerned ... Defendant No.2
Sir,
Please take notice that the above named plaintiffs herein have filed suit for declaration to declare the plaintiffs as surviving legal heirs of deceased [illegible]. When the matter came up for consideration the Hon'ble court was pleased to direct the plaintiff herein to issue service of notice through paper publication to you and posted the matter for appearance on 30-03-2026 at 10.30 AM before the above court either in person or through your counsel, if none of the parties appear on the above date before the above court the matter will be heard as per law.
(BY ORDER OF THE COURT)
NALLA HANUMANTH REDDY
Advocate
[illegible]
Dundigal Gandimaisamma (M), Medchal Malkajgiri (D), Telangana-500043
Ph: [illegible]

IN THE COURT OF THE HON'BLE 1st ADDL JUNIOR CIVIL JUDGE-CUM-VII ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT MEDCHAL
O.S.NO. [illegible] OF 2026
Between:
Smt. [illegible] Begum and others ...Plaintiffs
AND
The Tahsildar, Quthbullapur Mandal, Medchal - Malkajgiri District ...Defendants
To,
The Tahsildar, Quthbullapur Mandal, Medchal - Malkajgiri Dist.
Please take notice that my clients [illegible] ... against Defendant i.e. Tahsildar, Quthbullapur Mandal, [illegible] for appearance on 30-03-2026 at 10-30 A.M. in above said court [illegible] personally or through your counsel, otherwise the matter will be [illegible].
(BY ORDER OF THE COURT)
Sd/- [illegible] GAIKWAD
ADVOCATE
Plot No. [illegible], [illegible] Nagar, Suraram, Quthbullapur Mandal, Medchal - Malkajgiri District.
Cell: [illegible]

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE AT MEDCHAL
OS NO. 775 OF 2022
Between.
K. PUSHPAMMA ...Plaintiff
AND
SINGI REDDY YADI REDDY AND OTHERS ...Defendants
To,
The Defendants,
2) SMT. SINGIREDDY VENKATAMMA W/o Late Laxama Reddy, D/o late Singireddy Malla Reddy, age: 65 years, R/o H.NO: 7-119/1, Babaguda Village, Shamir pet Mandal, Medchal Malkajgiri District T.S. 500 078
7) SRI SINGIREDDY BALVANTH REDDY, S/o Late Laxama Reddy, age: 51 years, Occ: Business, R/o H. No: Villa No. 2, CELEBRITY CLUB, Shamir pet Village & Mandal, Medchal Malkajgiri District T.S. 500 078.
12) P. LAXIMI W/o Bal Reddy, C/o & D/o R. Satyamma, R/O H. No:2-26 HAJIPUR, Bommala Ramaran Mandal, Yadadri District. T.S. 508 126
13) BHAGYAMMA W/o Penta Reddy, C/o & D/o R. Satyamma, R/O H. No:2-26 HAJIPUR, Bommala Ramaran Mandal, Yadadri District. T.S. 508 126
14) KALAMMA W/o Anji Reddy, C/o & D/o R. Satyamma, R/O H. No:2-26 HAJIPUR, Bommala Ramaran Mandal, Yadadri District. T.S. 508 126
19) G. AVANTHI W/o G. Ramesh Reddy, C/o & D/o B. Kamalamma, R/o H. No: 10-127/2, Ram Nagar Colony, ALWAL Medchal Malkajgiri District. T.S. 500 010.
23) SMT. M. ANITHA W/o M. Venugopal Reddy, C/o & D/o S. Venkatamma, R/o H. No: 7-119/1, Babaguda Village, Shamir pet Mandal, Medchal Malkajgiri District T.S. 500 078.
25) SMT. K. ANITHA W/o K.Prathap Reddy, D/o K. Pushpamma, R/o House No. 1-51, RAMPALLY DAYARA, Keesara Village & Mandal, Medchal Malkajgiri District. - 501 301
26) SRI K. JANGA REDDY S/o K.Sathi Reddy, C/o & S/o K. Pushpamma, R/o House No. 2-4-44/4/1, Hanuman Tekidi, MACHA BOLLARAM, Near Selct Theatre (talkies), Secundrabad-500 010.
32) SMT. S. JAYA LAXIMI, W/o S. Mahesh Reddy, C/o & D/o D. Anjamma, R/o H. No: 1-5-365/91, Plot No 91, Surya Nagar Colony, ALWAL Medchal Malkajgiri District. T.S. 500 010.
To whomsoever it may concern the Petitioner SMT. K. PUSHPAMMA W/o K. Sathi Reddy D/o Late Singi Reddy Malla Reddy had filed case in OS No. 775/2022, on the file of HON'BLE II ADDL. DISTRICT & SESSIONS JUDGE at MEDCHAL Malkajgiri District, for PARTITION AND SEPARATE POSSESSION against her brothers, sisters and along with other joint family members, in the said suit comprised following Sy. No's 338, 339, 340, 341, 409, 410, 439, 545, 574, 575, 682, and 1247, altogether to an extent of Ac57-21gts, situated at Shamir-pet revenue Village & Mandal, Medchal Malkajgiri District, Telangana State. The above said suit is posted on 31 st March 2026 for enquiry and for calling the objections if any. Above said defendants are having objections with regard to the above said property they may directed to appear before the HON'BLE II ADDL. DISTRICT & SESSIONS JUDGE at MEDCHAL Malkajgiri District on 31.03.2026 at 10.30 AM in person or through Advocate, otherwise the matter will be decided in favor of the Plaintiff.
(By the Order of the Court)
Sd/- A. VENKATA RAMANA REDDY
ADVOCATE
Flat No. 504, NMR's GSR Residency Friends Colony, Chanda Nagar, Hyderabad-500 050. Cell No. 9440401098.



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న కాలనీవాసులు

## ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ సమస్యకు పరిష్కారం

**షాద్‌నగర్, మార్చి 15, ప్రభాతవార్త :** షాద్ నగర్ పట్టణంలోని మై హోమ్ కాలనీలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవ తీసుకోవడం అభినందనీయమని మై హోమ్ కాలనీ అధ్యక్షులు అబ్దుల్ వహాబ్ మాజీ అధ్యక్షులు అబ్దుల్ రహీం పేర్కొన్నారు. కాలనీలో లో వోల్టేజ్ త్రీఫేస్ కరెంట్ సమస్య ఏర్పడడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానిక నేత జమృత్ ఖాన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలుసుకున్న కాలనీవాసులు సమస్యను వివరించడంతో వెంటనే స్పందించి కాలనీలో అవసరమైన విద్యుత్ స్తంభాలు, ఇతర మెటీరియల్ ను విదుశాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు స్థానిక మైనారిటీ నేత జమృత్ ఖాన్ ధన్యవాదాలు తెలిపారు.



అంబేడ్కర్, కాన్షీరాంలకు నివాళులు అర్పిస్తున్న నరేందర్, గణేశ్

## మహనీయుల జీవిత చరిత్రను తెలుసుకోవాలి

**ఘట్‌కేసర్, మార్చి 15, ప్రభాతవార్త:** ఘట కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంట ర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకు వెళ్లడానికి 257వ వారం నిత్యపూలమాళ కార్యక్రమం నిర్వహించారు. నల్లోళ్ల నరేం దర్, జెమ్మిగారి గణేశ్‌లు విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. మేడ్చల్ జిల్లా పిబిఐ సమన్వ యకర్త ఎం.అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని అంబేద్కర్ సేవలను కొనియాడారు. అంబే ద్కర్ 60 దేశాల రాజ్యాంగాలను చదివి భారతదేశ వర్ణ వ్యవస్థని, కులవ్యవస్థను దృష్టిలో పెట్టుకొని దేశ స్థితిగతుల కారణంగా భారత రాజ్యాంగాన్ని రూపొం దించారని పేర్కొన్నారు. మాన్యవర్ కాన్షీరాం 92వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాళ వేసి నివా ళులు అర్పించారు. అరుణ్‌కుమార్ కాన్షీరాం జీవిత చరిత్రను తెలియజేశారు. ఈసం దర్భంగా భారత రాజ్యాంగ పీఠికపై అంద రూ ప్రమాణం చేశారు. కార్యక్రమంలో కె.నర్సింగ్‌రావు, కె.సత్యం, జి.అంజయ్య, జి.మహేశ్, నల్లోళ్ల శివకుమార్, ఎం.అశోక్, కృష్ణ, ప్రేమ్‌కుమార్, ఎస్.మధు, రవి, అంజయ్య, నిఖిల్, రమేశ్, విష్ణు, శివకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్సీ

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

**కొత్తూరు, మార్చి 15, ప్రభాతవార్త :** కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరి గూడలో శ్రీ ఆంజనేయ స్వామి, ధ్వజ స్తంభం, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య దేవేందర్ యాదవ్‌తో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లావణ్య దేవేందర్ యాదవ్, వైస్ చైర్మన్ డోలి రవీందర్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్, సీనియర్ నాయకుడు శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మెండే కృష్ణ యాదవ్, కౌన్సిలర్లు మాధవి గోపాల్, కోస్గి శ్రీనివాస్, సోమ్లా నాయక్, నాయకులు భిక్షపతి, శ్రీశైలం, వెంకటేష్, ఆంజనేయులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

## అంబేద్కర్ విగ్రహం వద్ద గార్డెన్ అభివృద్ధి చేయండి

**శామీర్‌పేట, మార్చి 15, ప్రభాతవార్త :** అలియాబాద్‌లోని మెయిన్ రోడ్డు వద్ద ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద గార్డెన్, పార్కు, స్టీల్ గ్రిల్స్, అభివృద్ధి పనులు చేపట్టాలని అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డికి ఆ గ్రామ మాజీ వార్డు మెంబర్ కె.లింగం, దళితసేన నాయకులు బాలేశ్, రాంచందర్‌లు వినతిపత్రాన్ని అందజేశారు. శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డిని ఛాంబర్‌లో కలిసి వారు వినతిపత్రాన్ని అందజేశారు. అలియాబాద్‌లోని మెయిన్‌రోడ్డు వద్ద ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. గార్డెన్, పార్కు, స్టీల్ గ్రిల్స్, స్టాండ్ ఏర్పాటు చేయాలని ఆమెను కోరారు.

# రూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

- సకాలంలో నాణ్యతతో పనులు పూర్తి చేయాలి
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**యాచారం, మార్చి 15, ప్రభాతవార్త:** లక్షలాది రూపాయల వ్యయం తో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశిం చారు. యాచారం మండల పరిధిలోని గున్‌గల్, మొండి గౌరెల్లి, యాచారం చౌదర్‌పల్లి, తులెకుర్ద్ గ్రామాలలో రెండు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులు సమయపాలన పాటించాలని స్పష్టంచేశారు. మెరుగైన ఫలితాలను సాధించటంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గున్‌గల్ గ్రామంలో సర్పంచ్ బాసాని బుచ్చిరెడ్డి, మాజీ వైస్ ఎంపిపి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైఎస్ ఎంపిపి గజ్జి రామకృష్ణ, ఉప సర్పంచ్ మచ్చ అనిల్ కుమార్‌లతో కలిసి రూ. 30 లక్షల అండర్ డ్రైనేజి పనులకు శ్రీకారం చుట్టారు. మొండిగౌరలల్లిలో సర్పంచ్ కొలను రమాదేవవి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ బడేకుమార్ వార్డు సభ్యులతో కలిసి రూ.36 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. చౌదర్‌పల్లిలో సర్పంచ్ కేశమోని రాజు, ఉప సర్పంచ్ గోరిగే శ్రీశైలం ఆధ్వర్యంలో రూ.45 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్ల పనులను ప్రారంభించారు. యాచారంలో సర్పంచ్ మస్కు అనిత శరణం, ఉపసర్పంచ్ మంగకృష్ణ, వార్డు సభ్యులతో కలిసి పనులు ప్రారంభించారు. తులెకుర్ద్‌లో సర్పంచ్ అంబోజ్ రమేష్, ఉప సర్పంచ్ నాయని శ్రీకాంత్, వార్డు సభ్యులతో కలిసి సిసి రోడ్ల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు, సినియర్ నాయకులు బిలకంటటి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి గజ్జి రామకృష్ణ యాదవ్, తక్కలపల్లి సర్పంచ్ నరేందర్ రెడ్డి, నాయిని దర్శన్ రెడ్డి, ఎటి లక్ష్మయ్య, మచ్చ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



వన మహోత్సవంలో పాల్గొన్న పద్మశాలి సంఘం నాయకులు, మహిళలు

## ఘనంగా వన మహోత్సవం

**కేశంపేట, మార్చి 15, ప్రభాతవార్త :** కేశంపేట్ మండలంలో పద్మాశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవ త్సరం ఉగాది పండుగ ముందు వనభో జనాలకు వెళ్లడం అనాదిగా వస్తున్న సాం ప్రదాయం. సంఘం అధ్యక్షులు కొట చందు తోపాటు సభ్యులు గంజి సధాకర్, గంజి చంద్రయ్య కొట వెంకటేష్, హరికృష్ణ, శ్రీని వాస్, బాలకృష్ణ, రాములు, బాలస్వామి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

## గ్రామాభివృద్ధే ప్రధాన లక్ష్యం

**పెద్దేముల్, మార్చి 15, ప్రభాతవార్త:** గ్రామా భివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని ఇందూరు సర్పంచ్ వెంకట్ ముదిరాజ్ అన్నారు. ఆది వారం పెద్దేముల్ మండలం ఇందూరులో రూ.10 లక్షల ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకట్ ముదిరాజ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని అన్నారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సిఎం రేవంత్‌రెడ్డి పాలన కొనసాగుతోందని గుర్తు చేశారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహ కారం తో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని అన్నారు. గ్రామ అబివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఫరీదాబేగం, వార్డు మెంబర్లు వి.మహే ష్‌కుమార్, మోసిన్, మాసుమ్, నయ్యుం, అమ్ము, కే.రవి, రాచిరెడ్డి పాల్గొన్నారు.

## నూతన ఎస్‌హెచ్‌ఓగా సైదులు

**జవహర్‌నగర్, మార్చి 15 ప్రభాతవార్త :** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌కు కొత్త స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా ఎస్. సైదులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సం దర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌హెచ్‌ఓ ఎస్. సైదులు మాట్లాడుతూ, జవహర్ నగర్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడేందుకు కట్టుబడి ఉంటామని తెలిపారు. ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు పోలీ సులకు సహకరించాలని కోరారు.



అందజేస్తున్న నవీన్ కుమార్ గౌడ్

## పుస్తె, మెట్టెలు బహూకరణ

**నందిగామ, మార్చి 15, ప్రభాతవార్త :** నందిగామ మండలం మామిడిపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు జినుగుంట్ల నవీన్ కుమార్ గౌడ్ ఆదివారం మామిడిపల్లి గ్రామానికి చెందిన చిర్ర చిన్న వెంకటయ్య కరుణమ్మ దంపతుల కుమార్తె వర్షిత పెళ్ళికి పుస్తె, మెట్టెలు బహుకరించారు. మీ దాం పత్య జీవితం రంగుల హరివిల్లును తలపిం చేలా ఉండాలని భగవంతుని కోరుకున్నారు. నిరుపేదల పాలిటి పెన్నిధిగా.. సేవ గుణంతో పచ్చని పెళ్లి పందిట్లో పుస్తె మెట్టె లు బహుకరించిన నవీన్ కుమార్ గౌడ్ సేవల పట్ల నవవధువు తల్లిదండ్రులు కృత జ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్ర గుంట ప్రభాకర్ రెడ్డి, మామిళ్ళపల్లి నర సింహ, కటికే పోగు శ్రీనివాస్, కటికే పోగు రమేష్, చిర్ర యాదయ్య, చిర్ర నరసింహ, చిన్న శ్రీహరి తదితరులు ఉన్నారు.

## 17న స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశానికి ఎంపికలు

**షాద్‌నగర్, మార్చి 15, ప్రభాతవార్త :** షాద్ నగర్ ఇండోర్ స్టేడియంలో తెలంగాణ స్పో ర్ట్స్ స్కూల్లో ప్రవేశాల కొరకు ఫరూక్ నగర్ మండల స్థాయిలో సెలక్షన్స్ నిర్వహి స్తున్నట్లు మండల విద్యాధికారి మనోహర తెలిపారు. ఈనెల 17వ తేదీన ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ఆన్లైన్ ద్వారా ఇందుకోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఉదయం తొమ్మిది గంటల వరకు స్టేడియం వద్దకు చేరుకొని ఆధార్ కార్డుతో కలిపి రిపోర్ట్ చేయా లని సూచించారు. అదేవిధంగా మండల పరిధిలోని పిఈటిలో, పిడిఎస్ లు ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరై విజయ వంతం చేయాలని ఆయన కోరారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వండి

**నందిగామ, మార్చి 15, ప్రభాతవార్త :** భూమి లేదు బుట్టలేదు.. రెక్కాడితే గాని డొక్కాడలేని బతుకు. కుటుంబ భారాన్ని మోసే నా భర్త చనిపోయాడు. నాకు కుమారుడు, కూతురు ఉన్నారు. తన భర్త కాలం చేయడంతో తన అమ్మగారి ఇంట్లో ఉంటూ ఇస్తరాకుల పరిశ్రమలో దినసరి కూలిగా పనిచేస్తూ పిల్లలను చదివించుకుంటూ సాకుతున్నాను. గత ఆరేళ్ల క్రితం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాను. ప్రజా ప్రతినిధులు గాని అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. అతి లేదు గతి లేదు. ఎమ్మెల్యే సారు మా దీనస్థితిని చూసి మాకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని నిరుపేద మహిళ లావణ్య కోరుతోంది.

## మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నాం

**కడ్తాల్, మార్చి15, ప్రభతవార్త :** కడ్తాల్ మండలం చరికొండ గ్రామంలో గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ అద్దాల మహేందర్ గౌడ్, ఉప సర్పంచ్ సామ బలవంత్ రెడ్డి వార్డు సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అద్దాల మహేందర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో చాలా కాలంగా ఉన్న రహదారి సమస్యలను పరిష్కరించేందుకు సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం గ్రామపంచాయతీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత గ్రామ ప్రజ లకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షా కాలంలో ఎదురయ్యే ఇబ్బందులు కూడా తగ్గు తాయని ఆయన అన్నారు. గ్రామంలో రహదారులు, పారిశుద్ధ్యం, మంచి నీటి వంటి సమస్యల పరిష్కా రానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు సర్పంచ్ మహేం దర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ బలవంత్‌రెడ్డి

## కల్వకుర్తి అభివృద్ధికి సహకరించాలి: 'ఐక్యత' చైర్మన్

**కడ్తాల్, మార్చి 15, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం హైద రాబాద్ లోని ఆయన నివాసంలో వేం నరేందర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభా కాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యులుగా ఎన్నిక కావడం తెలంగాణ రాష్ట్రానికే గర్వకా రణమని అన్నారు. పార్లమెంట్‌లో ఆయన తెలంగాణ ప్రజల సమస్యలను బలంగా వినిపిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తారని ఆకాంక్షి ంచారు. అదేవిధంగా కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు, నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం తదితర అంశాలపై ఆయనతో చర్చించినట్లు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు.



ఎంపి నరేందర్‌రెడ్డిని అభినందిస్తున్న రాఘవేందర్ రెడ్డి

## పేదల కోసం సిఐటూయూ వైద్య శిబిరాలు

**కీసర, మార్చి 15, ప్రభాతవార్త :** ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సిఐటియు కార్యదర్శి బంగారు నర్సింగ్‌రావు కోరారు. ఆదివారం నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి డబుల్ బెడ్ రూం దగ్గర పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్టు, ఆర్ఆర్ఆర్ ఫౌండేషన్‌లు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద లు నివాసం ఉంటున్న ప్రాంతంలో సిఐటియు అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. నేడు సామాన్యులకు వైద్యం ఖరీదైన నేపథ్యం లోఅత్యధిక మంది ప్రజలు అనారోగ్యంతో జీవనం కొనసాగిస్తు న్నారన్నారు. మెడికల్ క్యాంపుని ప్రారంభించిన ట్రస్టు చైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ వేలాది మంది పేదలు నివసిస్తున్న కాలనీలో వైద్య సేవలను అందిం చటం పేదలకు క్యాటరాక్ట్ కంటి ఆపరేషన్లు చేయిస్తా మన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 160 మందికి పైగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వాళ్లకు మందులు పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శివన్నారాయణ, లక్ష్మణ్, వెంకట్, హనుమంతు, పీపుల్స్ వెల్ఫేర్ నాయకులు దేవిరెడ్డి, జీవి రావు, సునీల్ కుమార్, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న సిఐటియు కార్యదర్శి బంగారు నర్సింగ్‌రావు

కార్మికులను సత్కరిస్తున్న సర్పంచ్ ప్రభాకర్

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యం

**కొందుర్గు, మార్చి 15, ప్రభాతవార్త:** ప్రతిరోజు గ్రామమంతా పరిశుభ్రతంగా ఉంటుందంటే అందుకు కారణం పారిశుద్ధ్య కార్మికుల కృషి వల్లనేనని గ్రామ సర్పంచ్ చౌదపురం ప్రభాకర్ అన్నారు. ఆదివారం నాడు స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు ఆయన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాల ఆవరణలలోను, అన్ని రహదారులను ప్రతినిత్యం వారు శుభ్రం చేస్తుండటం వలన గ్రామమంతా పరిశుభ్రతగా కనిపిస్తోందని పారిశుద్ధ్య కార్మికులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జిట్ట సురేఖ, ఉప సర్పంచ్ చిప్ప చంద్రశేఖర్‌తోపాటు పంచాయతీ సభ్యులు వెంకటేశం, నవీన్, లింగం, ప్రవీణ్, సునీత, నరసింహ, శ్రీను, సంజీవ, శ్రీకాంత్, షర్ఫుద్దీన్, పంచాయతీ సిబ్బంది భారత్ గౌడ్, రమేష్, శీను, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కల్చర్‌తో భ్రష్టు పట్టించారు

### మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ధ్వజం

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** డ్రగ్స్ కల్చర్‌తో తాండూరును భ్రష్టు పట్టించిన తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యే బుయ్యని మనో హర్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో డ్రగ్స్ కల్చర్ విపరీతంగా పెంచిపోషించారని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తు లకు టిక్కెట్లు ఇవ్వరాదని, ప్రజలు తరిమి కొట్టా లని పిలుపునిచ్చారు. యువతను నిర్వీర్యం చేసిన రోహిత్‌రెడ్డి పేరు ముందు 'పైలెట్' అనే పదం తీసేయాలని సూచించారు. పైలెట్ అంటే క్రమశిక్షణ, సహనంతో విమానాలను నడుపు తారని గుర్తు చేశారు. రోహిత్‌రెడ్డి తన ఇంటిపేరుకు బదులు పైలెట్‌ను పెట్టుకొని ఇలాంటి వ్యవహారాల్లో తలదూర్చడం సిగ్గు చేటని మండిపడ్డారు. తాండూరులో ఆయనను తిరగ కుండా చేయాలని ఆర్యవైశ్య రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్ కోరారు.

**జిల్లాలో ఒక్కసారిగా ప్రకంపనలు**

తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఫాంహౌజ్‌పై ఈగిల్ టీమ్ దాడుల్లో డ్రగ్స్ పట్టివేత సంఘటన జిల్లాలో ఒక్కసారిగా ప్రకం పనలు సృష్టించాయి. శనివారం రాత్రి నుంచి ఈగిల్ టీమ్, పోలీసులు జరిపిన సంయుక్త దాడుల్లో గన్, డ్రగ్స్ సంస్కృతి వెలుగులోకి వచ్చింది. పైలెట్ రోహిత్‌రెడ్డి, ఆయన సోదరుడు, వ్యక్తిగత సహాయకుడు, మరి కొంతమంది వీఐపీలు కూడా ఫాంహౌజ్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనతో జిల్లా ప్రజలు ఒక్కసారిగా ఉలికిపాటుకు గురైనారు. అక్కడ ప్రైవేటు వ్యక్తుల తుపాకీతో గాల్లోకి కాల్పులు జరిపినట్లు పోలీసులు చెప్పారు. ఈ సంఘటన వికారాబాద్, తాండూరు, పరిగి పట్టణాలను కుదిపేశాయి. అదే ఫాంహౌజ్‌లో మూడున్నరేళ్ల క్రితం ఎమ్మెల్యేల కొనుగోలు సంఘటన, తాజాగా డ్రగ్స్, గన్ కల్చర్ సంఘటనల పట్ల ప్రజలు ఆందోళనకు గురైనారు.

యువ నాయకుడుగా ఎదిగిన రోహి త్‌రెడ్డి 2009లో ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ప్రజారాజ్యం టిక్కెట్ ఆశించారు. అయితే, అప్పుడు టిక్కెట్ దక్కకపోవడంతో ఇండిపెం డెంట్‌గా పోటీ చేసినా పెద్దగా గుర్తింపు రాలేదు. కొంతకాలానికి టీఆర్ఎస్‌లో చేరారు. 2014లో ఆయనను కాకుండా టీడీపీ నుంచి వచ్చిన మహేందర్‌రెడ్డికి టీఆర్ఎస్ టిక్కెట్ ఇచ్చింది. ఒకవైపు టీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన మహేందర్‌రెడ్డి కేబినేట్ మంత్రిగా ఉండగా సొంత పార్టీలోనే ఉంటూ ఆయనకు వ్యతిరేకంగా వ్యవహరించారు. దాంతో ఆయనను పార్టీ నుంచి బహిష్కరించారు. అప్పటి నుంచి పార్టీలో ఉంటూనే యంగ్‌లీడర్స్ సంస్థ ద్వారా జనాల్లోకి వెళ్లారు. యువకుడైన రోహిత్‌రెడ్డి తాండూరుకు ఏదో చేస్తారన్న నమ్మకంతో 2018 ఎన్నికల్లో గెలిపించారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి తాండూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన పైలెట్ రోహిత్‌రెడ్డి కొద్ది రోజులకే టీఆర్ఎస్‌లో చేరారు. ఐదేళ్ల పాటు చిన్న వివాదాల్లో చిక్కుకున్న రోహిత్ 2023లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఆ ఎన్నికల కంటే ఆరు నెలల ముందు తన ఫాంహౌజ్‌లో ఎమ్మెల్యేలను బీజేపీలోకి రావాలంటూ తమను కొనుగోలు చేసేందుకు వచ్చా రంటూ ఓ సంఘటన తెరపైకి తెచ్చారు. అప్పట్లో ఈ సంఘటన తీవ్ర దుమారం రేపింది. 2023 ఎన్నికల వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం రోహిత్‌రెడ్డికి భారీ భద్రతను పెంచింది. ఓటమి చెందిన తర్వాత రోహిత్‌రెడ్డి విదేశీ వ్యాపార వ్యవహారాల్లో ఉన్నారంటూ బీఆర్ఎస్ శ్రేణులు చెప్పాయి. ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో మళ్లీ తాండూరుపై ఫోకస్ పెట్టిన రోహిత్‌రెడ్డి కౌంటింగ్ కేంద్రం వద్ద గొడవకు దిగారు.

ఆ సంఘటనలో రోహిత్ సహా కొంతమంది పార్టీ శ్రేణులపై కేసులు నమో దైనాయి. తాజాగా ఫాంహౌజ్‌లో డ్రగ్స్, గన్ సంఘటన ఒక్కసారిగా జిల్లాను కుదిపేశాయి.

# రూ.2.3 కోట్లతో అదనపు తరగతి గదులు



మారెపల్లి బాలికల పాఠశాలలో నూతనంగా నిర్మించిన తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**పెద్దేముల్, మార్చి 15, ప్రభాతవార్త:** విద్యార్థుల అభ్యున్నతే తెలంగాణ అభివృద్ధికి బలమైన పునాది అవుతుందని ఎమ్మెల్యే బుయ్యని మనో హర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దేముల్ మం డలం మారెపల్లి గ్రామంలోని కస్తూర్బాగాంధి బాలికల విద్యాలయంలో రూ.2 కోట్ల 30 లక్షలతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఏ రంగంలో ఎద గాలనుకుంటున్నారో లక్ష్యాన్ని నిర్ణయించు కోవాలని సూచించారు. క్రమశిక్షణ లేకుండా చదివిన చదువు నిరర్థకమవుతుందన్నారు. ఇప్పు డు చేసే కృషి, క్రమశిక్షణ పట్టుదల భవిషత్తును నిర్ణయిస్తాయని పేర్కొన్నారు. ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాం క్షించారు. అనంతరం విద్యార్థులచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంగలి సునిత, కోటపల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ అంజయ్య, వైస్ చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొమ్ము గోపాల్‌రెడ్డి, శోభారాణి, లొంక నర్సిములు, ఉప్పరి మల్లేశం, ఎల్లారెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్‌రెడ్డి, మాజీ చైర్మెన్ బాల్‌రెడ్డి, కెపిరావు, యండి రియాజ్, కోటపల్లి బందెన్న, హరిసూధన్‌రెడ్డి, వీరారెడ్డి, ప్రిన్సిపాల్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## మారెపల్లిలో వైభవంగా మైసమ్మ జాతర

**పెద్దేముల్, మార్చి 15, ప్రభాతవార్త:** పెద్దే ముల్ మండలం మారెపల్లిలో ఆరేమైసమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. జాతరను పురస్కరించుకొని అమ్మ వారి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మహిళలు పెద్దఎత్తున బోనాలతో ఊరేగింపుగా వెళ్ళి ఆలయ ప్రదక్షిణలు చేశా రు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొ క్కులు మొక్కుకున్నారు. పిల్లపాపలు సల్లంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. డప్పు వాయిద్యాల చప్పుళ్ళకు శివసత్తులు పూనకాలతో ఊగి పోయారు. పోతురాజు చేసిన విన్యాసాలు అందరిని ఆకట్టు కున్నాయి. జాతర సందర్భంగా ఆలయ పరిసరాలలో నెలకొల్పిన దుకాణాలతో మారెపల్లిలో పండుగ వాతవరణం నెల కొంది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.



బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

**అందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలి**

ఆరే మైసమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజ లంతా సుఖసంతోషాలతో ఉండాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం ఆరేమైసమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మారె పల్లిలో వెలిసిన ఆరే మైసమ్మ దేవతను భక్తి శ్రద్ధలతో పూజిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని అన్నారు. మహిమ గల దేవతగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారు మారెపల్లిలో వెలవడం ఎంతో శుభదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంగలి సునిత, కోటపల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ అంజయ్య, వైస్ చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు కేపి రావు, కొమ్ము గోపాల్‌రెడ్డి, లొంక నర్సిములు, ఉప్పరి మల్లేశం, శోభారాణి, హరిసూధన్‌రెడ్డి, వీరారెడ్డి, యండి.రియాజ్, కోటపల్లి బందెన్న ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

## రంజాన్ తోఫా దుస్తుల పంపిణీ

**శామీర్‌పేట, మార్చి 15, ప్రభాతవార్త:** రంజాన్ (పండుగ) మాసంను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ముస్లీం సోదర, సోదరీమణులకు అందజేస్తున్న తోఫా దుస్తులను రాష్ట్ర హాజ్ కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, మాజీ సర్పంచు బి.కిషోర్‌యాదవ్, మాజీ ఎంపిటిసి డి.సాయిబాబు, పలువురు కాంగ్రెస్ నాయకులు వారికి పంపిణీ చేశారు. ఆదివారం శామీర్ ఎటలోని మజీద్‌లో రంజాన్ దుస్తుల పంపిణీ కార్య క్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర హాజ్‌కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్ మాట్లాడుతూ రంజాన్ నెలా అత్యంత పవిత్రమైందని, ఉపవాసదీక్షలు, ప్రత్యేక ప్రార్థనలు చేయటంతో పాటు ధానధర్మాలు చేస్తూ భక్తి శ్రద్దలతో పండుగను జరుపుకుంటారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లీం సోదరుల పట్ల అండగా ఉంటూ ప్రతి ఏటా రంజాన్ పండుగ కోసం దుస్తులు తోఫా కిట్లను అందజేస్తుందని, పండుగను అందరు సంతోషంగా జరుపుకోవటానికి ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తుండటం పట్ల ముస్లీంలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎండి ముజీబుద్దీన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు ఎండి షఫీఉద్దీన్, మాజీ సర్పంచు బి.కిషోర్‌యాదవ్, మాజీ ఎంపిటిసి డి.సాయిబాబు, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, విలాసాగరం అశోక్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మేకల అంజనేయులు, సోగడి బాల్‌రాజ్, నాయకులు వంగ నర్సింహ్మారెడ్డి, సాయిపేట్ శ్రీనివాస్‌యాదవ్, మాజీ కోఆప్షన్ సభ్యులు చాంద్‌పాష, మాజీ వార్డుసభ్యులు ఎండి ఇర్ఫాన్, నాయకులు అఫ్జల్‌ఖాన్, గ్రామ ముస్లీం సోదర, సోదరీమణులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న హాజ్‌కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి తదితరులు

## వేద పాఠశాల అభివృద్ధికి రూ.1.11 లక్షల విరాళం

**షాద్‌నగర్, మార్చి 15, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ కిషన్ నగర్ రోడ్డు లో గల శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదినం సందర్భంగా శివలింగానికి అభిషేకం నిర్వహించిన గౌరవ శాసనసభ్యులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అంతకుముందు ఆలయ అర్చకులు వేద పాఠశాల విద్యార్థులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ కు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు సంగయ్య స్వామి, విద్యార్థులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఆశీర్వదించారు. అనంతరం జన్మద్నిన సందర్భంగా వేద పాఠశాల అభివృద్ధికి ఒక లక్ష 11 వేల రూపాయలు విరాళాన్ని అందజేశారు, ఈ సందర్భంగా కాశి వేద పాఠశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ సజ్జల కాశీనాథ్ భువనేశ్వర్, కౌన్సిలర్లు మురళీమోహన్ అప్పి, పెంటయ్య, శివ కుమార్ చందు నాయక్ కేకే కృష్ణ సత్యనారాయణ రెడ్డి సురేష్ శ్రీకాంత్ రెడ్డి లింగారెడ్డిగూడెం అశోక్, జంగారి రవి, కిట్టు, పాల్గొన్నారు. మ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదిన ఉత్సవాన్ని పురస్కరించుకొని యువ నాయకులు, అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా నేతలు, కార్యకర్తలు రక్తదానం చేయడం విశేషం. యువ నాయకుడు అరుణ్‌తో పాటు చాలామంది యువకులు రక్తదానం చేసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై తమ అభిమానం చాటుకున్నారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను అభినందించారు. నియోజకవర్గ అభివృద్ధికి గత రెండున్నరేళ్లుగా శంకర్ చేసిన సేవలు ఎమ్మెల్యేలకు ఆదర్శమని ఆయన పేర్కొన్నారు.



వేద పాఠశాల విద్యార్థులతో ఎమ్మెల్యే

**12వ వార్డులో ఉచిత వైద్య శిబిరం**

జన నాయకుడు షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదినం సందర్భంగా షాద్ నగర్ మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ కళ్యాణ్ కార్ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.

